# ఆసరా

ఓరగా వున్న తలుపు నెట్టుకుని లోపలికి వచ్చింది రమణ. ఆ శబ్దం విని మంచం మీద ముడుచుకు పడుకున్న శారద మరింత బిగుసుకుపోయింది.

"అమ్మా భోజనం చెయ్యండమ్మా బాగా పొద్దుపోయింది" అంటూ బతిమాలింది రమణ. ఎంత బతిమాలినా సమాధానం రాకపోవడంతో నా వైపు తిరిగింది.

"మీరైనా చెప్పండి బాబుగారూ! పొద్దునా సరిగ్గా తినలేదు. ఇలా అయితే అమ్మ ఆరోగ్యం పాడవదూ!" అంది దీనంగా.

"ఆకలైతే తనే తింటుంది. నువ్వు తినేసి పడుకో!" అని చెప్పి పంపించాను. మంచం దగ్గరికి వెళ్ళి శారద పక్కన కూర్చున్నాను.

"ఏమిటీ పిచ్చి? చిన్నపిల్లలా ప్రవర్తిస్తున్నావు శారదా!" మందలించాను.

"అవును నాది పిచ్చే అయిన వాళ్ళమీదా కాని వారి మీదా మమకారం పెంచుకోటం పిచ్చికాక మరేమిటి? అయినా దానికి ఆ మాత్రం బుద్ధి ఉండొద్దూ. ఎంత చేశాం, ఎంత బాగా చూసుకున్నాం! ఇసుమంతైనా కృతజ్ఞత ఉందా దానికి!" విరుచుకుపడింది.

నాకు ఆశ్చర్యం వేసింది. "ఎంత మాటన్నావ్! రమణకి కృతజ్ఞత లేదా! నువ్వు మనస్పూర్తిగా అంటున్నావా? అదేం చేసిందని అంత మాటన్నావ్? కృతజ్ఞతకి మారు పేరు అంటూ ఉంటే అది అక్షరాలా రమణే అని నువ్వే ఎన్నిసార్లన్నావ్".

"అన్నాను అప్పుడు దాని అవసరం కాబట్టి అదలా నటించింది. అవసరం తీరగానే అసలు రూపు బయట పెట్టింది. లేకపోతే ఇక్కడ దానికేం తక్కువ జరిగిందని

వాడు పిలవగానే మూటముల్లే సర్దుకుని బయలుదేరింది? రానని వాడికి చెప్తే వాడు కాదంటాడా! బలవంతాన లాక్కెళ్తాడా? పైగా దొంగ ఏడుపులు నంగనాచి కబుర్లు" ఉక్రోషంతో దుమ్మెత్తి పోస్తోంది శారద.

నాకు జాలీ నవ్వూ ముంచుకొచ్చాయి. "పిచ్చిదానా! నీ బాధ నాకు అర్థం అయింది. ఆవేశం అణుచుకుని ప్రశాంతంగా ఆలోచించు. రమణ ప్రవర్తనలో ఏ కాస్తయినా తప్పు కనిపిస్తే దండించే హక్కు నీకుంది. కానీ వెతికి చూసినా లోపం కనిపించని ఆ పిచ్చిదానిమీద అనవసరంగా నిందలు వెయ్యడం భావ్యమా శారదా!" అనునయించాను. వెంటనే చేతుల్లో మొహం దాచుకుని బావురుమంది.

ఏనాటి మాట. అప్పట్లో నేను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. ఊరి చివరగా ఉండేది మా బంగళా. ఆ వేళ తుఫాను కుండపోతగా వర్షం. కరెంటు పోయింది. కొవ్వొత్తి వెలుగుతోనే భోజనాలు కానిచ్చాం. రాత్రి తొమ్మిది గంటలయిందేమో వాచ్‌మన్ అరుపులు వినిపించి టార్చ్‌లైటు తీసుకుని బయటికి వచ్చాను.

"చెప్తే నీక్కాదూ! అసలిక్కడికెలా వచ్చావ్? ఎంత ధైర్యం? కదులు" అంటూ అరుస్తున్నాడు.

బయటి వరండాలో వణికిపోతూ నిలబడివుంది ఆ ఆకారం. కాళ్ళదగ్గర ఓ మూట. జాలివేసింది నాకు. "ఇంత వర్షంలో ఎక్కడికి పోతుంది? తెల్లారాక వెళ్ళిపోతుందిలే" అని చెప్పేను. వాచ్‌మన్ గొణుక్కుంటూనే వెళ్ళిపోయాడు.నేను లోపలికి వచ్చేశాను.

అలవాటు ప్రకారం అయిదింటికే మెలకువ వచ్చేసింది. వాతావరణం బాగాలేదు. కాబట్టి మార్నింగ్‌వాక్‌కి వెళ్ళే ప్రసక్తే లేదు. మెయిన్ డోర్ తీసుకుని వరండాలోకి వచ్చాను.

వరండాలో నిలచిన వర్షం నీటిలో చేతులు తపతప కొట్టి ఆడుకుంటున్నాడు ఓ పసివాడు. ఒంటిమీద నూలుపోగు లేదు. గుమ్మడి పండులా ఉన్నాడు. అయితే రాత్రి మూటలా ఉన్న పదార్థం వీడేనన్నమాట. నన్ను చూడగానే పలకరింపుగా నవ్వాడు. నాకూ నవ్వొచ్చింది. నేను నవ్వగానే పాకుతూ వచ్చి నా కాళ్ళు పట్టుకుని నిలబడి నోట్లో ఉన్న రెండు పళ్ళూ బయట పెట్టి మళ్ళీ నవ్వాడు.

వాడి బుగ్గలు నిమిరాను. శారద కాఫీ తీసుకొచ్చింది. వెంటనే నవ్వుతూ శారదనీ పలకరించాడు ఆ పసివాడు. 'కాసిని పాలుంటే వీడికి పట్టు శారదా' అన్నాను. అలాగే అంది. ఈ సందడికి చలికి మునగదీసుకుని పడుకున్న వాడి తల్లి లేచింది. భయం భయంగా వచ్చి వాడిని చంకన వేసుకుంది. వాడు ఉంటేనా? జారిపోయి మళ్ళీ నీళ్ళ దగ్గరికి పోయాడు.

మరి కాసేపటికి మా పనిమనిషి ఉంటున్న ఇళ్ళన్నీ వరదలో మునిగి పోయాయని తెలిసింది. 'పనెలా? ఇది ఎప్పుడొస్తుందో' అని బెంగపడింది శారద. ఆ అమ్మాయి ముందుకొచ్చి – నేను చేస్తానమ్మా' అందిట.

ఆ సాయంత్రం నేను వచ్చేసరికి బోలెడంత సమాచారం సేకరించి ఉంచింది శారద. ఆ శాల్తీ పేరు రమణ. వయసు పద్దెనిమిది. అయిదేళ్ళ కిందటే పెళ్లయిందిట. ఏవో గొడవలు.... దాంతో రెండేళ్ళు కాపురానికి తీసికెళ్ళలేదుట. ఆ తరువాత అత్తవారింటికి వెళ్ళింది. ఆమె మొగుడు కొరివి. ఇంకెవరినో మరిగి దీన్ని కాల్చుకు తినేవాడుట. ఏడాది కిందట ఇంట్లో వాళ్లను బెదిరించడానికి ఏదో మింగి అది వికటించడంతో చచ్చిపోయాడు. వాడు పోయిన నెల తరువాత పిల్లాడు పుట్టాడు. పురుగును చూసినట్లు చూసేవాళ్ళట అత్తవారింట్లో. అన్నీ భరించిందిట. చివరకు శరీరం మీద అత్యాచారం జరిగేలా ఉంటే కట్టుబట్టలతో పారిపోయి వచ్చిందిట.

అంతా చెప్పి బాధపడింది శారద. "వయసులో ఉంది. ఒంటరిగా ఈ లోకంలో ఎలా బతుకుతుంది? ఏదైనా ఏర్పాటు చేద్దాం" అంది.

అలాగే అన్నాను. అనుకున్న ప్రకారం ఇలా దిక్కులేనివారిని చేరదీసి ఉపాధి మార్గం చూపించే సంస్థతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాను. మనస్ఫూర్తిగా బాగుపడాలనే తపన మనిషిలో ఉంటే అందుకు మార్గాలు ఉన్నాయి! తప్పకుండా పంపించమన్నారు ఆ సంస్థవారు.

మా పనిమనిషి పది రోజుల తరువాత వచ్చింది. ఆ పదిరోజులూ రమణే పని చేసింది. ఇక పంపుదాం అనుకుంటూ ఉండగా బాంబేలో ఉన్న మా మామగారి దగ్గర నుంచి ఓ రిక్వెస్టు, ఆఖరి మరదలు పురిటికి వస్తోంది. అత్తగారి ఆరోగ్యం బాగాలేదు. ఇక్కడ మనుషులు దొరకడం కష్టం. అక్కడ ఎవరినైనా చూసి పంపించండి... అని రాశారు. శారద రమణని అడిగిందిట.

"మీ ఇష్టం అమ్మా" అందిట రమణ. పసిపిల్లాడితో ఇదేం చేస్తుంది అని సందేహించాను నేను. మరేం ఫర్వాలేదు చాలా బాగా పనిచేస్తుంది. నెమ్మదైన మనిషి. ఇప్పటికిప్పుడు ఇంతకంటే ఎవరు దొరుకుతారు అంది శారద. మనిషిని సాయం ఇచ్చి రమణని బొంబే పంపించాం. ఆ వెళ్ళడం వెళ్ళడం సంవత్సరం పాటు అక్కడే ఉండిపోయింది. ఇంట్లో మనిషిలా కలిసిపోయింది. అవసరానికి మంచి మనిషిని పంపి ఆదుకున్నారు అని మామగారు ఎన్నోసార్లు ఉత్తరాల్లో తెలియజేశారు.

ఆ తరువాత మా శారదకు మనిషి అవసరం కలిగింది. మేము ఊరు మారాం. కొత్త ఊర్లో మహిళా మండలి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనవలసి వచ్చింది. కాబట్టి రమణని వెనక్కి పిలిపించాం. అయిష్టంగానే పంపించారు మా అత్తగారు.

ఆ తరువాత రమణ మా ఇంట్లో ఓ భాగం అయిపోయింది. రమణ కొడుక్కి అయిదో ఏడు వచ్చింది. బాగా చురుకు. గోడలెక్కా గొబ్బెలెక్కా ఏ చెట్టుమీద గాలిపటం పడ్డా వీడు తియ్యాల్సిందే. క్రిష్ణుడు అని పిల్చేది శారద. ఒకరోజు హడావుడిగా ఫోన్ చేసింది శారద.

ఏడుపుగొంతుతో సగం మింగేస్తూ కంగారుగా చెప్పిన మాటల్లోని సారాంశం ఏమిటీ అంటే రమణ మామగారు వచ్చాడుట. మా మనవడు కాబట్టి వాడిని నేను తీసుకుపోతాను అని గొడవ చేస్తున్నాడుట. తాగి ఉన్నాడు. రమణ పిల్లాడిని కావలించుకుని భయంతో వణికిపోతూ ఏడుస్తోందిట. వెంటనే నా దగ్గర పనిచేసే మెరికలాంటి మనిషి, శాస్త్రిని పిల్చి 'వెళ్ళి ఆ గొడవేమిటో చూడు' అని పంపించాను.

వ్యవహారం అంతా సర్దుబాటు చేసి మర్నాడు సాయంత్రానికి వచ్చాడు శాస్త్రి. "వాడు తాగుబోతు వెధవ సార్! వీళ్ళిక్కడ ఉన్నారని తెలిసి డబ్బు గుంజడానికి వచ్చాడు. పిల్లాడిని నాతో పంపమని మొండికేసేసరికి రమణ బెదిరిపోయింది. నేను పక్కకి తీసికెళ్ళి కాస్త పోయించేసరికి నిజం చెప్పాడు. డబ్బు ఆశ చూపిస్తే కుక్కలా దారికి వచ్చాడు. పన్లోపనిగా వాడి ఊరికి వెళ్ళి ఈ కాయితాలు తెచ్చాను" అన్నాడు శాస్త్రి.

ఒకటి ఇక పిల్లాడి జోలికిరానని వాడి చేత రాతపూర్వకమైన హామీ, రెండోది క్రిష్ణుడి బర్త్ సర్టిఫికెట్. నాకు ఆశ్చర్యం వేసింది. "అటువంటి ఇంట్లో పుట్టిన పిల్లాడికి బర్త్ సర్టిఫికెట్ ఎవరు ఇచ్చారు?"

"రమణికి డెలివరీ కష్టం అయితే గవర్నమెంట్ నర్సే పురుడు పోసిందిట. కాబట్టి సర్టిఫికెట్ అమిరింది వాడికి. నిన్న వాడి తాతచేత ఈ కాయితం రాయించుకుని

రెండొందలు ఇచ్చాను. దాంతో ఆశపుట్టి ఈ కాయితం కూడా కావాలా అని తెచ్చి చూపించాడు. మరో వంద ఇచ్చి ఇదీ తెచ్చాను. ఇక వాడి బెడదే లేదులెండి. మళ్ళీ ఇటువైపు వస్తే జైల్లో పెట్టిస్తారు అయ్యగారు అని బెదిరించాను" అన్నాడు శాస్త్రి.

అతనికి డబ్బు ఇచ్చేశాను. మంచిపని చేశావు శాస్త్రీ అని మెచ్చుకున్నాను. ఆ సర్టిఫికెట్ క్రిష్ణుడి జీవితానికి బంగారుబాట. వాడి కులం ధ్రువపరుస్తూ ప్రభుత్వం వాడికోసం ఏర్పాటు చేసిన సదుపాయాలన్నీ సద్వినియోగం చేసుకునే రాజమార్గం.

ఆ తరువాత సెలవులకు వచ్చిన మా అబ్బాయి వాసు ఇక గాలికి తిరిగింది చాల్లే పద అంటూ క్రిష్ణుడిని తీసికెళ్ళి స్కూల్లో చేర్పించాడు. వాడో మెరిక. చదువులోనూ ఆటపాటల్లోనూ అన్నిటా ప్రథముడు. స్కూలు చదువు పూర్తిచేసి కాలేజీకి వచ్చాడు డిగ్రీలో చేరాడు.

నేను రిటైర్ అయ్యాను. అప్పటివరకూ ఉన్న హంగులు, అన్నీ జనగణమణ అనంతరం సభికుల్లా ఒక్కసారి తప్పుకున్నాయి. ఆర్థికంగా మాకే లోటూ లేదు. స్వంత ఇల్లు కట్టుకున్నాం. పెన్షనొస్తుంది. ఆ పరిస్థితుల్లో కొండంత అండ రమణ. ఇంటి పన్ను సరేసరి. పనిమనిషి చేత పని చేయించడం దగ్గర్నుంచి ఇల్లు సర్దడం ఎవరైనా వస్తే సమాధానం చెప్పి పంపించడం, అన్నీ తనే చూసుకునేది. కరెంటు బిల్లు కట్టాలన్నా తనే వెళ్ళేది. సరుకులు తేవాలన్నా తనే తెచ్చేది. ఒక విధంగా చెప్పాలంటే రమణ మీదే ఆధారపడి బతుకుతున్నాం అంటే అతిశయోక్తి ఎంత మాత్రమూ లేదు. కన్నబిడ్డలు దూరంగా ఉన్నా ఆ లోటు లేకుండా చూసుకుంటోంది రమణ.

కృష్ణుడు పీజీ పూర్తిచేసి గవర్నమెంటు లెక్చరరుగా చేరాడు. "నేను సివిల్ సర్వీసెస్ పరీక్షలకి ప్రిపేర్ అవుతాను బాబా! అన్నాడు" అన్నట్లే సాధించాడు. ఫారెస్ట్ సర్వీస్ వచ్చింది.

"నీ కొడుకు పెద్ద ఆఫీసరు అయ్యాడు రమణా" అంటే – తలొంచుకుని నవ్వేసి తప్పుకుంది. అసలు రమణ స్వభావమే అంత. ఏనాడూ నోరెత్తి మాట్లాడేది కాదు. అన్నీ మా నిర్ణయానికే వదిలేసేది. ఆనాడు 'రమణా బాంబే వెళ్తావా' అంటే 'మీ ఇష్టం' అని ఎలా అన్నదో ఇప్పుడు అదేమాట అంది. "మీ ఇష్టం బాబూ!" అంది.

కానీ ఈసారి నిర్ణయం తీసుకోవడం నాకు గండకత్తెరగా తయారైంది. కృష్ణుడికి ట్రైనింగ్ పూర్తయింది. పోస్టింగ్ వచ్చింది. అంత వరకూ మహదానందం. నిన్నరాత్రి

పదింటికి ఫోన్ చేశాడు. మామూలు మాటలన్నీ అయ్యాక “వీలు చూసుకొని వచ్చేవారం వస్తాను బాబా! అమ్మని నాతో తీసుకు వచ్చేస్తాను” అన్నాడు.

వాడు చెప్పింది జీర్ణించుకునేసరికి నా గుండె జారిపోయింది. వాడన్న దాంట్లో అసహజం ఏమీలేదు. ప్రయోజకుడైన బిడ్డ తల్లిని తన దగ్గరకు తీసుకు వెళ్ళాలను కోవడంలో తప్పేం వుంది?

కానీ రమణ మాకు దూరంగా వెళ్ళిపోతుందని ఊహించకపోవడం మాదే తప్పు. శారద తెల్లబోయింది. “ఇదేమిటండీ రమణను తీసుకెళ్తానంటాడేమిటి?” అంది వెర్రిదానిలా.

“అందులో తప్పేముంది శారదా! మన అబ్బాయి అమెరికాలో ఉన్నాడు. అక్కడికి శాశ్వతంగా వెళ్ళడం మనకిష్టం లేదు. కాబట్టి ఇక్కడ ఉన్నాంగానీ లేకపోతే మనం మాత్రం వెళ్ళేవాళ్ళం కాదా!” అన్నాను.

“ఇంతకీ దాని అభిప్రాయం ఏమిటో అడగండి” అంది శారద.

పిల్చి అడిగాను. “కృష్ణుడు నిన్ను తీసుకువెళ్తాడుట. వెళ్తావా రమణా!” అన్నాను. అలవాటు ప్రకారం.

“మీ ఇష్టం బాబుగారు!” అనేసి నిర్ణయం నాకే వదిలేయడంతో నా నెత్తిన బరువు పడినట్లు అయింది. అయితే నిర్ణయం తీసుకోడానికి నేనట్టే ఆలోచించలేదు. “వచ్చేవారం వస్తాడు వాడు. నీ సామాన్లన్నీ సర్దుకో” అనేశాను.

దాంతో శారదకి కోపం వచ్చింది. నిన్న రాత్రంతా నిద్రపోలేదు. రమణని దుమ్మెత్తిపోస్తోంది. తిండీతిప్పలూ వదిలేసింది. శారద మనఃస్థితి నాకు తెలుసు. అందుకే వదిలేసి ఊరుకున్నాను. గుండె తేలికపడేలా ఏడ్చి అప్పుడే లేచి కళ్ళు తుడుచుకుంది.

“నిజమేనండీ ఇన్నాళ్ళూ అది మనకు చేసిన సేవకి ఏమిచ్చినా బదులు తీర్చుకోలేం. కాకపోతే కన్న బిడ్డలా ఉంది. కాబట్టి అది వెళ్తుందంటే బాధగా ఉంది” అంది.

“కాదు శారదా! కన్న బిడ్డలు ఋణానుబంధాలు. మన అమ్మాయి, అబ్బాయి దూరదేశాలకు వెళ్ళినప్పుడు కూడా బాధపడ్డాం. వాళ్ళు దూరమై పోతున్నారని బాధ. కానీ ఇప్పుడు రమణ విషయంలో అలా కాదు, అది వెళ్తే మనం దిక్కులేని వాళ్ళం అయిపోతామేమో అని భయపడుతున్నాం. మనం చాలా స్వార్థపరులం శారదా” అన్నాను.

"నిజమే మీరు చెప్పింది. అమ్మాయి కాపురానికి వెళ్తుంటే దానికోసం అన్నీ సర్దాను, ఆనందంగా దాన్ని అత్తవారింటికి సాగనంపాను. మరి ఇది కొడుకు దగ్గరికి వెళ్తానంటే తిండీ నీళ్ళూ మానేసి దాన్ని తిట్టిపోస్తున్నాను. జరిగింది ఏదో జరిగిపోయింది. ఇక నా మనసు గట్టి చేసుకుంటాను. అయినా కొడుకు దగ్గరకు వెళ్ళడం దానికీ ఎంతో మంచిది. ఇక్కడ మనం ఎంత బాగా చూసినా దాని హోదా పనిమనిషి హోదాయే కదా! అక్కడలా కాదు, అదే యజమానురాలు. సోఫాలో కాలుమీద కాలువేసుకుని కూర్చోవచ్చు. దర్జాగా డైనింగ్ టేబుల్ మీద అన్నం తినొచ్చు. పోన్లెండి జీవితం అంతా కష్టపడ్డందుకు ఇప్పుడు మంచి రోజులు వచ్చాయి" అంది దుఃఖంతో కంఠం బొంగురుపోగా.

ఆ తరువాత వారం రోజులూ భారంగానే గడిచాయి. రమణ లేకుండా జీవించడానికి మానసికంగా సిద్ధపడ్డాం. కానీ ఎంత ప్రయత్నించినా ఏదో దిగులు. అభద్రతా భావం. ఒక్కసారి వయసు మీదపడినట్లు అయింది.

ఇక రెండ్రోజుల్లో కృష్ణుడు వస్తాడనగా ఆ వేళ డాక్టరు దగ్గరికి వెళ్ళాం.

"ఏమిటి భార్యాభర్తలు దెబ్బలాడుకున్నారా! బి.పి. ఇలా పెరిగిపోయింది ఇద్దరికీ!" అన్నాడాయన. "వయసుమీద పడడంలా! నాకు అరవై ఎనిమిది నా భార్యకి అరవై రెండు. మీ అనుమానం సరికాదు. మాది అన్యోన్య దాంపత్యం" అనేశాను.

ఇద్దరం ఇంటికి చేరుకున్నాం. కార్లోంచి దిగానో లేదో నా కాళ్లు గాల్లోకి లేచాయి. ఎదురుగా కృష్ణుడు. అలవాటు ప్రకారం నన్ను ఎత్తి దించాడు. కళ్ళు తిరిగినట్లయి కారుకి ఆనుకున్నాను. వెనక సీట్లోంచి దిగిన రమణ కొడుకుని మందలించింది.

"దుడుకు వెధవా! ఏమిటా సరసం? బాబుగారికి కళ్ళు తిరగవూ!" అని తిట్టింది.

ఫర్వాలేదులే అనేసి "రేపొస్తానన్నావు కదురా ఇవ్వాళే వచ్చేవేం?" అని అడిగాను.

సెలవు ముందుగా దొరకడంతో ఓ రోజు ముందుగానే బయలుదేరాడుట.

పగలంతా బాబా మామీ అంటూ కబుర్లు చెప్తూనే ఉన్నాడు. వాడి పసితనంలో నన్ను బాబుగారూ అనీ శారదని మేమ్‌సాబ్ అనీ పిలవాలని మా వాచ్‌మన్ చెప్తే నోరు తిరగక బాబా అని నన్నూ, మామీ అనీ శారదనీ పిల్చేవాడు. అదే అలవాటు

అయింది.

అలవాటు ప్రకారం హాల్లో దివాన్ మీద పడుకున్నాను. నా కాళ్ళ దగ్గర కూర్చుని కాళ్ళునొక్కడం మొదలు పెట్టాడు. వాడుంటే ఈ పాదసేవా భాగ్యం తప్పదు నాకు. వద్దురా అన్నా వినడు.

వాడి ఉద్యోగం గురించిన సాధక బాధకాలన్నీ చెప్పుకొన్నాడు. ఎలా మెలకువగా వ్యవహరించాలో చెప్పాను. శ్రద్ధగా విన్నాడు.

"రేపు రాత్రికి రైలుకి రిజర్వేషన్ అయిపోయింది బాబా! నేనూ అమ్మా వెళ్తాం!" అన్నాడు.

మామూలుగా ఉండడానికి చాలా శ్రమపడవలసి వచ్చింది. "అలాగే వెళ్ళిరండి ప్రయోజకుడివి అయ్యావు. ఇక మీ అమ్మని సుఖపెట్టు. మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకో. నీకు వీలున్నప్పుడు వచ్చి ఓ సారి కనిపించి వెళ్ళు" ఎంత వద్దనుకున్నా కంఠం బరువెక్కింది.

చివాల్న తలెత్తాడు క్రిష్ణుడు. "అదేం మాట మీరు రారా మాతో!" ఆశ్చర్యంగా అడిగాడు. ఈసారి ఆశ్చర్యపోవడం నా వంతు అయింది. "మేమా? నీతోనా?" అడిగాను.

"అవును బాబా! మీరు నాతో ఉంటారనే మీ సర్వీసులో ఉన్నప్పటిలాగే మీకు అన్నీ దర్జాగా జరగాలనే నేనీ సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసింది. నాకూ, అమ్మకీ అయితే ఓ క్లర్కు ఉద్యోగం చాలదా!

"మిమ్మల్నీ అమ్మగార్నీ వదలి నేనూ అమ్మా ఎలా ఉంటాం? చిన్నబాబుగారు ఏమైనా అనుకుంటారేమో అని సందేహం మీకొద్దు. ఆయన్ని నేను బతిమాలు కుంటాను. అమ్మాయిగారూ ఏమీ అనుకోరు. వాళ్ళ దగ్గరికీ వెళ్ళి వస్తూ ఉండవచ్చు. కానీ మీరు మాత్రం నా దగ్గరే ఉండాలి. అమ్మని తీసుకువెళ్లి అక్కడ అన్నీ సిద్ధం చేశాక వచ్చి మిమ్మల్ని తీసుకు వెళ్తాను. ఏం బాబా వస్తారు కదూ! కాదనకండి!" అంటూ నా ఒళ్ళో తలదాచుకున్నాడు.

భగవంతుడు వచ్చి వరం తీసుకోరా అని బతిమాలుతుంటే భక్తుడేం చెప్తాడు? నా మనసు దూదిపింజలా తేలికపడింది.

"వాడి తలనిమిరాను. వస్తాం తండ్రీ ఆనందంగా వస్తాం" అన్నాను.

*ఈనాడు ఆదివారం, 29 అక్టోబర్ 2000*